నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 9 జూన్ 2024 | SANGAREDDY

హాఫ్ మారథాన్ ఆన్‌లైన్ లింక్ ఆవిష్కరించిన హరీశ్‌రావు


మాజీ మంత్రి హరీశ్‌రావుతో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు

సిద్దిపేట, జూన్ 8: సిద్దిపేటలో జూలై 28న ద్వితీయ ఎడిషన్ హాఫ్ మారథాన్ నిర్వహించనున్నట్లు సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి అన్నారు. రెండో హాఫ్ మారథాన్ ఆన్‌లైన్ లింకును మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సిద్దిపేట ప్రజలు సెకండ్ ఎడిషన్ హాఫ్ మారథాన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మంచి కార్యక్రమాలు తలపెట్టినప్పుడు విజయవంతం కావడానికి సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తుల బాపురెడ్డి, కోచ్ నిరంజన్, మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, నిఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ దిగుబడి ప్రారంభం

సిద్దిపేట జిల్లాలో 11వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

- రాయితీలు కల్పించి రైతులను ప్రోత్సహించిన బీఆర్ఎస్ సర్కారు
- మాజీమంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు
- నంగునూరు మండలంలో చేతికి రానున్న తొలి పంట
- నేడు అక్కెనపల్లిలో తొలి పంట కోతను ప్రారంభించనున్న మాజీమంత్రి హరీశ్‌రావు

గెలలు తీసేందుకు సిద్ధంగా ఉన్న అక్కెనపల్లి గ్రామంలోని ఆయిల్‌పామ్ పంట, సిద్దిపేట ప్రాంతంలో సాగవుతున్న ఆయిల్ పామ్ తోట

నంగునూరు, జూన్ 8: సిద్దిపేట జిల్లాలో ఆయిల్‌పామ్ దిగుబడి ఆరంభమైంది. ఆయిల్‌పామ్ తొలి పంట తీసేందుకు రైతులు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జిల్లాలో సుమారు 11 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులకు ప్రోత్సాహాన్ని అందించింది. ప్రభుత్వపరంగా అనేక రాయితీలు కల్పించి రైతులను ఆయిల్‌పామ్ సాగు చేసుకునే విధంగా అన్నిరకాలుగా ప్రోత్సాహకాలు అందించింది. మండల పరిధిలోని నర్మెటలో 65 ఎకరాల్లో రూ.300 కోట్ల వ్యయంతో ఫ్యాక్టరీ నిర్మించనుంది. పనులు సైతం కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మాజీమంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని సిద్దిపేట జిల్లాలో ఆర్థికంగా ఎంతో లాభదాయకంగా ఉండే ఆయిల్‌పామ్‌ను సాగుచేసేందుకు గ్రామగ్రామాన అవగాహన సదస్సులు నిర్వహించి రైతులను ప్రోత్సహించారు. దాని ఫలితంగా ఆదివారం ముందుగా వేసిన ఆయిల్‌పామ్ తోటల్లో తొలి ఆయిల్‌పామ్ గెలలను తీసే కార్యక్రమాన్ని అక్కెనపల్లి గ్రామంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించనున్నారు.

1,669 ఎకరాల్లో సాగు

నంగునూరు మండలంలో మొత్తం 493 మంది రైతులు 1,669 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారు. ముందుగా అక్కెనపల్లిలో 26 మంది రైతులు సుమారు 168 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారు. గ్రామానికి చెందిన రైతు నాగేందర్ తోటలో తొలి గెలలు తీసేందుకు సిద్ధం చేశారు. ఈమేరకు ఆదివారం మాజీమంత్రి హరీశ్‌రావు తొలి గెలలు తీసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్ వరకు సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో 415 ఎకరాల్లో పంట చేతికి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఏడు ఎకరాల్లో సాగు చేశా..

మాది అక్కెనపల్లి గ్రామం. మాజీ మంత్రి హరీశ్‌రావు సూచన మేరకు 7 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశా. పంట వేసిన తర్వాత మొదటిసారి గెలలు చేతికి రానున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు అనేక రకాలుగా రైతులకు ప్రోత్సాహకాలు, రాయితీలు అందించింది. ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు.

– తిప్పని నాగేందర్, ఆయిల్‌పామ్ రైతు, అక్కెనపల్లి గ్రామం, సిద్దిపేట జిల్లా

బదిలీలకు రంగం సిద్ధం

జిల్లాస్థాయి నుంచి మండల స్థాయి వరకు.. పోస్టింగ్‌ల కోసం మంత్రుల వద్దకు పరుగులు

- కాంగ్రెస్ నేతల చుట్టూ తిరుగుతున్న అధికారులు



సిద్దిపేట, జూన్ 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతుంది. జిల్లాస్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు బదిలీ కానున్నారు. ఏండ్ల తరబడి ఒకే దగ్గర పని చేసిన అధికారులకు స్థాన చలనం తప్పకపోవచ్చు. ఈ పరిస్థితుల్లో జిల్లాల్లో మంచి పోస్టింగ్‌ల కోసం అప్పుడే స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రుల వద్దకు అధికారులు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీలకు షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక అధికారుల బదిలీలపై దృష్టి సారించింది. తమకు అనుకూలమైన అధికారులను జిల్లా స్థాయిలో నియమించడానికి అధికారుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర హెచ్‌వోడీలు బదిలీ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒకేచోట పనిచేసిన అధికారులకు స్థానచలనం తప్పదంటున్నారు. జిల్లా నుంచి మండల స్థాయి వరకు తమకు అనుకూలమైన అధికారులను నియమించుకోవడానికి కాంగ్రెస్ నాయకులు జాబితాను సిద్ధం చేసి జిల్లాకు చెందిన మంత్రులకు ఇవ్వనున్నారు.

మంచి పోస్టు కోసం అధికారుల బేరసారాలు

కొంతమంది అధికారులు స్థానిక నాయకుల సహకారంతో మంచి పోస్టు కోసం అప్పుడే బేరసారాలు మాట్లాడుకుంటున్నారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులు వారి సొంత ప్రాంతాలకు వెళ్లిపోతారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల్లోని అధికారుల్లో బదిలీలపై జోరుగా చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉమ్మడి మెదక్ జిల్లాలో కొంత మంది అధికారులు బదిలీ అయ్యారు. ప్రస్తుతం కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు సైతం బదిలీ అవుతారన్న చర్చ సైతం జరుగుతున్నది. వీరితో పాటు జిల్లాలోని ప్రధాన శాఖల హెచ్‌వోడీల బదిలీలకు కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తమకు నచ్చిన అధికారులను తెచ్చుకునే పనిలో నేతలు ఉన్నారు. తాము చెప్పింది చేసే అధికారి ఉండాలని అధికార పార్టీ నేతలు కోరుకుంటున్నారు. ఏ అధికారి ఎన్ని ఏండ్ల నుంచి పని చేస్తున్నారు. ఎవరెవరు ఎక్కడ పని చేస్తున్నారు అని ఆరా తీసి తమకు అనుకూలమైన అధికారుల జాబితాను సిద్ధం చేసే పనిలో కొంతమంది నేతలు ఉన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసిన అధికారుల బదిలీలు తప్పవు అనే చర్చ అన్నిచోట్లా నడుస్తుంది. ఎలాగో కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో ఒక్క చోటికి బదిలీ చేస్తుంది... ఇక తమ బదిలీ ఎప్పుడు వచ్చినా వెళ్లేందుకు అధికారులు సిద్ధమతున్నారు. కనీసం ఇక్కడ కాకపోయిన వేరే చోటైనా పక్క జిల్లాలోనే ఉంటే బాగుండు అని కోరుకుంటూ తమతమ ప్రయత్నాలు చేస్తున్నారు అధికారులు.

పట్టుబడ్డ రేషన్ బియ్యం బస్తాలు

రేషన్ బియ్యం పట్టివేత

దుబ్బాక,జూన్ 8: ప్రభుత్వం పేదలకు అందించే (పీడీఎఫ్) రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాలను శనివారం దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జిల్లెల్లకు చెందిన పర్వతం నరేశ్ కంటైనర్‌లో 136 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా సిద్దిపేట-రామాయంపేట రోడ్డులో మెదక్‌కు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి దుబ్బాక మండలం మర్రికుంట సమీపంలో కంటైనర్ డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. ఈ విషయాన్ని కంటైనర్ డ్రైవర్ నరేశ్ తన యజమాని జిల్లెల్లకు చెంది న రాజుకు ఫోన్లో సమాచారమివ్వగా, మరో కంటైనర్‌ను ఘటన స్థలానికి పంపించాడు. రోడ్డు పక్కన ఒరిగిన కంటైనర్ నుంచి రేషన్ బియ్యం బస్తాలను మరో కంటైనర్‌లోకి లోడ్ చేస్తుండగా సమాచారం అందుకున్న దుబ్బాక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రెండు కంటైనర్లలో రేషన్ బియ్యం బస్తాలను దుబ్బాక పీఎస్‌కు తరలించారు. కంటైనర్ యజమాని రాజుపై కేసు నమోదు చేసి, సివిల్ సప్లయ్ అధికారి రాజిరెడ్డికి రేషన్ బియ్యం అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

రాజీతో కేసుల పరిష్కారం

- లోక్ అదాలత్‌లో 3,059 కేసులు పరిష్కారం
- బాధితులకు రూ.15.80 కోట్ల పరిహారం
- తొమ్మిది బెంచీల్లో లోక్ అదాలత్‌లు
- సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

బాధితులకు పత్రాలు అందజేస్తున్న సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

సంగారెడ్డి, జూన్ 8: కోర్టుల్లో కేసులు వేసి ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు జాతీయ లోక్ అదాలత్‌లు ఉపయోగపడుతాయని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర అన్నారు. శనివారం సంగారెడ్డిలోని జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధానన్యాయమూర్తి భవానీచంద్ర జ్యోతి వెలిగించి ప్రారంభించారు. లోక్ అదాలత్‌లను జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర అధ్యక్షతన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ నిర్వహించారు. మోటరు వాహన ప్రమాదాల నిర్వాసితులకు పరిహారం చెక్కులు, విడాకులకు కోర్టును ఆశ్రయించిన మూడు జంటలను కలిపి లోక్ అదాలత్‌లతో రాజీ చేసుకుంటే ఫలితం దక్కుంతుందని న్యాయమూర్తి కక్షిదారులకు సూచించారు. జిల్లాలో సంగారెడ్డి-5, జహీరాబాద్-2, జోగిపేట్-1, నారాయణఖేడ్-1 కోర్టుల్లో 9 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేశారు. కక్షిదారులు న్యాయవాదులను కలిసి రాజీతో కేసులు పరిష్కరించుకోవడం సంతోషకరమన్నారు.

3,059 కేసుల పరిష్కారం

సత్వర న్యాయానికి లోక్ అదాలత్‌లు ఉపయోగకరమని న్యాయమూర్తి భవానీచంద్ర అన్నారు. న్యాయవాదుల సలహాలు పాటించి న్యాయం పొందాలన్నారు. లోక్ అదాలత్‌లలో 3,059 కేసులను పరిష్కరించి, బాధితులకు 15.80కోట్లకు పైగా పరిహారం అందించామన్నారు. ఇందులో మోటరు వాహన ప్రమాద నష్టపరిహారం-19 కేసులు, క్రిమినల్ కాంపౌండ్ కేసులు-2,832, సివిల్ తగాదాలు-8, బ్యాంక్ రికవరీ కేసులు-48, ఏపీటీఎస్-6 కేసులు, భూసేకరణ కేసులు-7, విద్యుత్ చౌర్యం, ప్రిలిటిగేషన్-143 కేసుల్లో బాధితులకు రూ.15,80,62,286కోట్ల పరిహారం ఇప్పించామన్నారు. అదాలత్‌ల్లో ఇరు పార్టీలకూ సమన్యాయం చేసేందుకు కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు విధులు నిర్వహించే పోలీసులు సమన్వయం చేసుకోవడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా విడాకులకు కోర్టులో కేసుల వేసిన దంపతులు ఒక్కటి కావడం ఆనందంగా ఉందని, వీరిని ఆదర్శంగా తీసుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్న దంపతులు న్యాయం పొంది సంసారాన్ని చక్కదిద్దుకోవాలని ఆకాంక్షించారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొదటి అదనపు న్యాయమూర్తి జయంతి, రెండో అదనపు జడ్జి కృష్ణార్జున, మూడో అదనపు జడ్జి సునీతారవీంద్రారెడ్డి, నాలుగో అదనపు జిల్లా జడ్జి లావణ్య, సీనియర్ సివిల్ న్యాయమూర్తి రాధాకృష్ణాచౌహాన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, తేజశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు వర్ధన్‌రెడ్డి, ప్రభుత్వం తరపు న్యాయవాది నర్సింగ్‌రావు, సీనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్‌క్రైమ్ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, న్యాయవాదులు

నిధుల గోల్‌మాల్‌పై పంచాయితీ

అధికారులకు తలనొప్పిగా మారిన ఎంపీవో, కార్యదర్శుల పంచాయితీ

- ఇరువురి మధ్య పరస్పర ఆరోపణలు
- డీపీవో, కలెక్టర్ దృష్టికి చేరిన పంచాయితీ
- విచారణ చేపట్టిన డీఎల్పీవో... ఎంపీవోపై చర్యలకు రంగం సిద్ధం

అందోల్, జూన్ 8: గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ బూతుల నిర్వహణకు వచ్చిన నిధుల చెల్లింపుల్లో కార్యదర్శులు, ఎంపీవో మధ్య ముదిరిన పంచాయితీ ఫిర్యాదుల వరకు వెళ్లింది. ఇరువురి పరస్పర ఆరోపణల విషయం జిల్లా పంచాయతీ అధికారితో పాటు కలెక్టర్ వరకు చేరింది. ఈ పంచాయితీ అధికారులకు తలనొప్పిగా మారడంతో డీఎల్‌పీవో కార్యదర్శులతో పాటు ఎంపీవోను రహస్యంగా విచారణ చేశారు. అందోల్ మండలంలో మొత్తం 39 పోలింగ్ కేంద్రాలుండగా ఒక్కో కేంద్రానికి రూ.3 వేల చొప్పున మొత్తం రూ.లక్షా 80 వేలు ఎన్నికల ఖర్చు కింద నిధులు వచ్చాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత ఎంపీవో మాకు ఇవ్వకుండా తన వద్దే పెట్టుకున్నారని, ఈ విషయంపై పలుమార్లు అడగ్గా ఆ డబ్బుల గురించి అడగొద్దు.. ఏమైనా ఉంటే మీ పంచాయతీల్లో చూసుకోండి అటూ సమాధానం ఇవ్వడంతోపాటు అన్ని విషయాల్లో ఇబ్బందులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతన్నట్లు కార్యదర్శులు ఎంపీవోపై డీఎల్పీవోకు విన్నవించారు. ఎంపీవో మాత్రం పంచాయతీల్లో పనుల లెక్కలు సరిగా ఉంచాలని అడగ్గా కార్యదర్శులు నాపై కక్ష కట్టారని డీఎల్‌పీవోకు వివరించారు. ఈ విషయంపై డీఎల్‌పీవో సంజీవరావు మాట్లాడుతూ ఎంపీవోపై పంచాయతీ కార్యదర్శులు ఫిర్యాదు చేసిన విషయంపై విచారణకు వెళ్లామని తెలిపారు. పూర్తి విచారణ అంశాలను డీపీవోతోపాటు కలెక్టర్‌కు అందించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

కుప్పలు తెప్పలుగా 'చేపలు'

- మృగశిర రోజు పెద్దఎత్తున చేపల వేట


కూటిగల్ నల్ల చెరువులో దొరికిన చేపలను వాటాల ప్రకారం పంచుకుంటున్న మత్స్యకారులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 8: మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని వివిధ చెరువుల్లో మృగశిర కార్తెను పురస్కరించుకొని మత్స్యకారులు పెద్దఎత్తున చేపల వేటను సాగించారు. మద్దూరు మండలంలోని వల్లంపట్ల, ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ నల్ల చెరువులో శనివారం మత్స్యకారులు చేపలు పట్టారు. ఈ విషయం తెలుసుకొని చెరువుల వద్దకు జనం పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మృగశిర కార్తె రోజు చేపలు తింటే ఆస్తమా, ఉబ్బసం వంటి వ్యాధులు దరిచేరవనే నమ్మకంతో మత్స్యకారుల వద్ద చేపలు కొనేందుకు జనం ఎగబడ్డారు. మత్స్యకారులు తమకు వచ్చిన వాటా ల ప్రకారం చేపలను కుప్పలుగా వేసి పంచుకున్నారు. దీంతో ఆయా గ్రామాలల్లోని చెరువుల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

బడి బస్సు సామర్థ్య పరీక్షలు

పాఠశాలల బస్సులు రోడ్డు ఎక్కాలంటే అనుమతి తప్పనిసరి

- సిద్దిపేట జిల్లాలో 372 బస్సులు
- ఇప్పటికి 160 వాహనాల తనిఖీ పూర్తి
- బస్సులపై అడుగడుగునా నిఘా
- తల్లిదండ్రులూ దృష్టి పెట్టాలంటున్న అధికారులు
- ఇప్పటికే పాఠశాల యాజమాన్యాలకు, వాహన డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన

సిద్దిపేట జిల్లా కేంద్రంలో బస్సుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు

సిద్దిపేట టౌన్, జూన్ 8: సిద్దిపేట జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. రవాణాశాఖ జీవో నెంబర్ 35 ప్రకారం పాఠశాలలు, కళాశాలల బస్సులు నిబంధనలు పాటిస్తే వాటికి అనుమతులు లభిస్తాయి. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా రోడ్డుపై తిరిగేందుకు అనుమతి ఉండదు. సిద్దిపేట జిల్లాలో 372 బస్సులు ఉన్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికి వరకు రవాణా శాఖ అధికారులు 160 వాహనాలను తనిఖీ చేశారు. 212 బస్సుల సామర్థ్యాన్ని తనిఖీ చేయాల్సి ఉంది. ఈ పూర్తి ప్రక్రియ ఆన్‌లైన్‌లో సాగనుంది. విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత 15 రోజుల వరకు సామర్థ్య పరీక్షలను పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లాలో సామర్థ్య పరీక్షల నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు, తదితర అంశాలపై కథనం...బడి బస్సులు ఫిట్‌గా ఉంటేనే విద్యార్థులు సురక్షితంగా ఇంటికి వెళ్తారు. పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా రవాణాశాఖ అధికారులు బడి బస్సులకు సామర్థ్య పరీక్షలను నిర్వహించి అనుమతులు ఇస్తారు. ఇందులోభాగంగా ఈ ఏడాది సామర్థ్య పరీక్షలను ముందుగానే అధికారులు ప్రారంభించారు.

సిద్దిపేట జిల్లాలో 4చోట్ల పరీక్షలు

ఒకప్పుడు సిద్దిపేటలో మాత్రమే బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేది. మూడేండ్లుగా గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ ఎంవీఐ కార్యాలయాల్లో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉండే ప్రైవేటు పాఠశాలలకు ఉపయుక్తంగా మారింది. నాలుగు చోట్ల కార్యాలయాలు వికేంద్రీకరణ కావడంతో అధికారులు కూడా మరింత నిఘా పెట్టేందుకు అవకాశం కలిగింది. నిర్ధేశిత ముగియగానే సామర్థ్యం, ధ్రువీకరణ పత్రాలు లేకపోతే అధికారులు కొరడా ఝుళిపించవచ్చు. పాఠశాల యాజమాన్యాలు దళారులను నమ్మి మోసపోవద్దు.

తల్లిదండ్రులు దృష్టి సారించాలి

పిల్లలను బడిలో చేర్పించామని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నీ దగ్గరుండి పాఠశాల వారే చూసుకుంటారని చేతులు దులుపుకుంటే సరిపోదు. పాఠశాలకు సంబంధించిన అన్నింటిపైన తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి. బడి బస్సు ఫిట్‌నెస్, బస్సులోని లోపాలు, పరిమితికి మించిన పిల్లలను ఎక్కించుకునే వాటిపైన, వేగంగా బస్సులను నడపేతే అలాంటి వాటిపైన ఎప్పటికప్పుడు ఆరా తీయాలి.. లోపాలను పాఠశాల యాజమన్యాలకు ఫిర్యాదు చేయాలి.

నిబంధనలు

పాఠశాల బస్సులు 15 ఏండ్ల కాలపరిమితిని మించకూడదు. వాహనం ముందు, వెనుక బడి పిల్లల చిత్రాలను స్పష్టంగా పెద్దగా వేయాలి. కిటికీకి అడ్డంగా మూడు కడ్డీలను ఉంచాలి. ఇంజిన్, క్లచ్ గేర్ పూర్తి సామర్థ్యం కలిగి ఉండాలి. ప్రథమ చికిత్స, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలు ఆర్పివేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బస్సులో ప్రధానంగా ప్రత్యేక ద్వారం తప్పనిసరిగా ఉండాలి. సైడ్లకు బస్సు రేడియం, స్టిక్కర్ ముందు తెలుపు, వెనుక ఎరుపు స్టిక్కర్లను అతికించాలి. వాహనం ఆగితే బ్లింక్ అయ్యేలా పైభాగం నాలుగు వైపుల అంబర్ లైట్లు ఉండాలి.

చర్యలు తీసుకుంటాం

పూర్తిస్థాయి సామర్థ్యం కలిగిన వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తాం. ఈ ఏడాది మరింత పక్కాగా పరీక్షలు జరుపుతున్నాం. ఇప్పటికే పాఠశాల యాజమాన్యాలకు, వాహన డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించాం. అనుమతులు పొందకుండా పాఠశాల బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈనెల 15 నుంచి ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తాం. నిబంధనలు పాటించని పాఠశాల బస్సులను తనిఖీ చేసి పట్టుబడిన వాటిని అక్కడికక్కడే సీజ్ చేస్తాం. – శంకర్ నారాయణ, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, సిద్దిపేట జిల్లా

పేదలకు ఇండ్లు మంజూరు చేయాలి

- సొంతిండ్లు లేక ఇబ్బందులు పడుతున్న ఎంతోమంది పేదలు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

కోహీర్, జూన్ 8: సంగారెడ్డి జిల్లాలో ఎంతోమంది పేదలు సొంతిండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి కాంగ్రెస్ సర్కారు ఇండ్లు కట్టించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. బీజేపీకి సంపూర్ణ మెజార్టీ రాకపోవడంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నదని, ఎన్డీఏ కూటమి ఎన్నో రోజులు అధికారంలో ఉండే అవకాశం లేదని ఆయన జోస్యం చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిన బీజేపీకి చంద్రబాబు మద్దతు తెలుపడం సరైన నిర్ణయం కాదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జలాలొద్దీన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్, నర్సింహులు, అజారుద్దీన్, చిరంజీవి, అశోక్, దత్తురెడ్డి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.